జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..


జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శుక్రవారం | 21-2-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 254 పేజీలు: 4 వెల : రూ.7






# పట్టా మార్పిడికి.. పైసా వసూల్!

* డీ పట్టాను జిరాయితీగా మారిస్తే ఎకరాకు ఐదు లక్షలు
* పాస్‌బుక్‌కు మరో రేటు
* పలాస తహశీల్దార్ కార్యాలయంలో కొందరు సిబ్బంది రెవెన్యూ లీలలు
* ముగ్గురు ఉద్యోగులపై ఆరోపణలు
* వివరణ అడిగితే కస్సుబుస్సుమంటున్న మండల అధికారి
* ఏమవుతుంది.. బదిలీయే కదా అంటూ నిట్టూర్పు
* ఇక్కడ కాకపోతే.. మరోచోట అంటూ రుసరుసలు
* ముఖ్యమంత్రి పేషీ, ఏసీబీకి ఫిర్యాదు?

**పలాస/శ్రీకాకుళం క్రైం, ఫిబ్రవరి 21 (వార్త):** ప్రజలకు సేవ చేయాల్సిన రెవెన్యూ శాఖలో కొందరు సిబ్బంది అవినీతి, అక్రమాలు ఆశాఖకే మచ్చ తెస్తోంది. పలాస తహశీల్దార్ కార్యాలయంలో ఓ ముగ్గురు ఉద్యోగులు ప్రజలకు సేవలందించడం మరచిపోయి కలెక్షన్‌పైనే పడ్డారు. రెవెన్యూకు సంబంధించి ఏ పని కావాలంటే క్షణాల్లో చేసిపెడుతున్నారు.. అయితే దానికో రేటు ఉంటుందిమరి. మ్యుటేషన్ చేయాలన్నా, పట్టాదారు పాస్ పుస్తకం ఇవ్వాలన్నా, డీ పట్టాను జిరాయితీగా మార్చాలన్నా.. ఇలా అనేక రెవెన్యూపరమైన సేవలను కాసులు తీసుకుని చకచకా చేసేస్తున్నారు. డబ్బున్న మారాజులు, కొందరు రియల్టర్లు కార్యాలయానికి రాకుండానే తమ పని కానిచ్చేస్తున్నారు. పేద రాజులు మాత్రం డబ్బులు ఇచ్చుకోలేక గ్రీవెన్స్‌లో వినతులు ఇస్తూ కార్యాలయం చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. పలాస రెవెన్యూ డివిజన్‌గా మారాక పలాస తహసీల్దార్ కార్యాలయంలో కొందరు ఉద్యోగుల పని తీరు, అక్రమాలు గత కొద్ది రోజులుగా పత్రికల్లో కథలు కథలుగా వస్తున్నాయి. ఇక్కడ ఓ ముగ్గురు రెవెన్యూ అధికారులు చక్రం తిప్పుతున్నారు. ఈ విషయం రెవెన్యూ కార్యాలయంలో ఎవరికి అడిగినా చెబుతారు. ఇటీవల ఓ డీ పట్టాను జిరాయితీగా మార్చేందుకు ఎకరాకు ఐదు లక్షలు డిమాండ్ చేశారట.. ఆ ముగ్గురు. ఇలాంటి భూములు కలిగి ఉన్న వారి వివరాలు సేకరించి ఏకంగా వారి వద్దకే ఆ ముగ్గురు వెళ్లి మీ డీ పట్టాను జిరాయితీగా మార్చేస్తామంటూ లక్షలకు లక్షలు కలెక్షన్ చేస్తున్నారని విమర్శలు ఉన్నాయి. ఈ వ్యవహారం గుట్టుచప్పుడుగా జరిగేది. ఈ అక్రమ వసూళ్లకు సంబంధించి సిబ్బంది మధ్య వాటాల కుదరకపోవడంతో ఈ వ్యవహారం కాస్త బయటకు వచ్చిందన్న సమాచారం. కొందరు సమాచారం ఇవ్వడంతో వారం రోజులుగా పత్రికల్లో కథనాలు వస్తున్నాయి. అయితే రెవెన్యూ అధికారి కనుసన్నల్లోనే ఇదంతా జరుగుతుందని, మాకేం కాదని ఆ ముగ్గురు బహిరంగంగానే ప్రగల్భాలు పలుకుతుండడం విశేషం. ఈవిషయమై అక్కడి మండల రెవెన్యూ అధికారులకు పత్రికా ప్రతినిధులు వివరణ అడిగేందుకు ప్రయత్నించగా ఆయన కస్సుబుస్సులాడారు. పత్రికల్లో కథనాలు వస్తే ఏమవుతుందే.. మహా అయితే బదిలీ అంతేగా.. ఇక్కడ కాకపోతే మరోచోట అని మాట జారడంతో అక్కడున్న వారంతా అవాక్కయ్యారు. పలాస రెవెన్యూ కార్యాలయంలో జరుగుతున్న అవినీతి, అక్రమదందాపై కొందరు ఏసీబీతో పాటు ముఖ్యమంత్రి కార్యాలయానికి సమాచారం ఇచ్చినట్టు తెలిసింది.



# వారంతా పాత నేరస్థులే!

* గంజాయి తరలిస్తున్న నలుగురు అరెస్టు
* 21 కేజీలు స్వాధీనం
* రిమాండ్‌కు తరలింపు
* వివరాలు వెల్లడించిన ఏఎస్పీ కేవీ రమణ



**శ్రీకాకుళం క్రైం, ఫిబ్రవరి 21 (వార్త):** వారంతా పాత నేరస్తులు.. గతంలో గంజాయి అమ్ముతూ.. దొంగతనాలు చేసిన వారే.. తక్కువ సమయంలో ఎక్కువ ఆదాయం కోసం గంజాయి అమ్మకాన్ని వృత్తిగా చేసుకున్నవారే. వారిలో ఇద్దరు ముగ్గురు అల్రెడీ జైలుకెళ్లి బెయిల్‌పై వచ్చిన వారే. గంజాయి అమ్మడం, పట్టుబడడం, జైలుకెళ్లడం వారికి సాధారణంగా మారింది. ఆ నలుగురు మళ్లీ కలిశారు.. గంజాయి కొనుగోలు చేసి పెద్ద ఎత్తున విక్రయించేందుకు ప్లాన్ చేశారు. ఒడిశా నుంచి గుట్టుచప్పుడు కాకుండా తెచ్చుకున్నారు. వాటాలు పంచుకుంటుండగా.. పోలీసులకు పట్టుబడి కటకటాల పాలయ్యారు. దీనికి సంబంధించిన వివరాలను పోలీసులు మీడియా వద్ద వెల్లడించారు. శ్రీకాకుళం రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సింగుపురం హటకేశ్వర స్వామి ఆలయం సమీపంలోని కొండ దిగువన గంజాయిని పంచుకుంటున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేశామని ఏఎస్పీ కేవీ రమణ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం ఏఎస్పీ మీడియాతో మాట్లాడారు. శ్రీకాకుళం మండలం బైరవానిపేటకు చెందిన బగ్గు నవీన్, పాత్రునివలసకు చెందిన ధర్మాన ప్రవీణ్ కుమార్, శ్రీకాకుళం నగరం కొత్త దమ్మలవీధికి చెందిన చీకటి యోగేశ్వర రావు, పెద్దరెల్లివీధికి చెందిన జలగడుగుల తార వికాస్‌లను గంజాయితో పట్టుకున్నామన్నారు. వీరు ఒక్కొక్కరూ రూ.30వేలు చొప్పున పోగు చేసుకుని బగ్గు నవీన్ వద్ద గంజాయి కొనుగోలు చేశారన్నారు. నవీన్ పర్లాకిమిడి వెళ్లి ఓ సాధువు నుంచి కేజీ గంజాయి రూ.5వేలు చొప్పున మొత్తం 21 కేజీల గంజాయిని కొనుగోలు చేసి దాన్ని ప్లాస్టిక్ సంచిలో ఈనెల 20న శ్రీకాకుళం తీసుకు వచ్చాడన్నారు. హటకేశ్వర స్వామి గుడి కింది భాగంలో తుప్పల్లో దాచిపెట్టాడని తెలిపారు. శుక్రవారం ధర్మాన ప్రవీణ్ కుమార్, చీకటి యోగేశ్వరరావు, అవతార్, జలగడుగుల తార వికాస్ వికాస్‌తో కలిసి ఈ గంజాయిని పంచుకుంటున్నారు. దీన్ని కొందరు పోలీసులకు సమాచారం అందించారు. శ్రీకాకుళం రూరల్ ఎస్ఐ రాము ఆధ్వర్యంలో పోలీసులు వారిని చుట్టుముట్టి పట్టుకుని గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ధర్మాన ప్రవీణ్‌పై చోరీ కేసులు కూడా ఉన్నాయని చెప్పారు. యోగేశ్వరరావు, తారవికాస్‌లు గతంలోనూ గంజాయి కేసులో పట్టుబడ్డారన్నారు. ఈ నలుగురిని రిమాండ్‌కు పంపించామని ఏఎస్పీ తెలిపారు.

**ప్రతిభకు ప్రశంస**

గంజాయిని తరలిస్తున్న నలుగురిని పట్టుకోవడంలో ప్రతిభ చూపిన డీఎస్పీ సీహెచ్ వివేకానంద, రూరల్ సీఐ కె.పైడపునాయుడు, ఎస్ఐ కె.రాము, ఏఎస్ఐ ఢిల్లేశ్వరరావు, హెడ్‌కానిస్టేబుళ్లు కృష్ణమూర్తి, ఎస్.సన్యాజ్, కానిస్టేబుళ్లు వరదరాజులు, వాసుదేవరావు, రాంబాబులను ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. మీడియా సమావేశంలో సీఐ సీహెచ్ పైడపునాయుడు, రూరల్ ఎస్ కె.రాము పాల్గొన్నారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## వైస్సార్సీపీ నియోజకవర్గ యువజన అధ్యక్షుడిగా నర్తు ప్రేమ్



**ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 21(వార్త):** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇచ్ఛాపురం నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షునిగా ఈదుపురంనకు చెందిన నర్తు ప్రేమ్‌కుమార్ యాదవ్ నియమితులయ్యారు. తనను నియమించినందుకు జిల్లా పార్టీ అధ్యక్షులు ధర్మాన కృష్ణదాసు, ధర్మాన ప్రసాదరావు, తమ్మినేని సీతారామ్, సీదిరి అప్పలరాజు, నియోజకవర్గ ఇన్‌చార్జి పిరియా విజయకు, ఆయన ధన్యవాదాలు తెలియజేసారు. పార్టీ తనకు అప్పజెప్పిన బాధ్యతలను అంకితభావంతో పనిచేసి ఇచ్ఛాపురం నియోజకవర్గంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు కృషిచేస్తానని తెలిపారు.అందుకు నిరంతరం వెన్నంటే ఉంటూ వెన్నుతట్టి ప్రోత్సహించిన ఈదుపురం ప్రజానీకానికి ఇచ్ఛాపురం నియోజకవర్గం ప్రజలకు ప్రత్యేకం ధన్యవాదములు తెలియజేస్తునట్లు తెలిపారు.

# జిల్లాను ప్రగతిపథంలో తీసుకెళ్లాలి


**-అన్ని శాఖలు సమన్వయంతో ముందుకు సాగాలి -తాగునీటి సమస్య పై దృష్టి సారించాలి -జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ**







**శ్రీకాకుళం, ఫిబ్రవరి 21(వార్త):** అన్ని శాఖల సమన్వయంతో పార్టీలకతీతంగా జిల్లాను ప్రగతిపథంలో తీసుకువెళ్లాలని, అందరూ కలిసికట్టుగా ఒకే తాటిపై నడుస్తూ జిల్లా అభివృద్ధి పథంలో పయనించేలా సమష్టిగా పనిచేయాలని, రానున్నది వేసవి కాలం కావునా త్రాగునీటి సమస్యలేకుండా ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్, స్థాయి సంఘాల అధ్యక్షురాలు పిరియా విజయ అన్నారు. జిల్లా అభివృద్ధిలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. జిల్లా ప్రజా పరిషత్, శ్రీకాకుళం నకు సంబంధించి 2వ, 4వ ,7వ స్థాయి సంఘాల సమావేశాలు జిల్లా పరిషత్ చైర్ పర్సన్ అధ్యక్షతన, ముఖ్య కార్య నిర్వహణాధికారి ఎల్ ఎన్ వి శ్రీధర్ రాజు ఆధ్వర్యంలో శుక్రవారం మధ్యాహ్నము 2.30 గంటలకు స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగింది. జిల్లా ప్రజా పరిషత్ అధ్యక్షులు శ్రీమతి పిరియా విజయ అధ్యక్షతన నిర్వహించిన 2, 4, 7వ స్థాయి సంఘ సమావేశాలలో పారిశుద్య, రహదారులు మరియు భవనాలు, విద్యుత్, నీటి పారుదల శాఖలు, జిల్లా గ్రామీణ నీటి యాజమాన్యసంస్థ , జిల్లా పంచాయతీ, గృహనిర్మాణ సంస్థ, వైద్య ఆరోగ్య శాఖలు వారీగా సమీక్షలు నిర్వహించి సంబంధిత అధికారులుకు పలు సూచనలు జారీ చేశారు. సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అందజేస్తున్న వృద్ధాప్య, వితంతు పింఛన్ల పంపిణీ పై సరుబుజ్జిలి జడ్పిటిసి ఎస్. నాగేశ్వర రావు వివరణ కోరగా జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వృద్ధాప్య, వితంతు పింఛన్ల పంపిణీకి సంబంధించిన వివరాలు వివరించారు. సాంఘిక సంక్షేమ శాఖ, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ, బి.సి.కార్పొరేషన్, వ్యవసాయ శాఖ, ప్రణాళిక శాఖ, పట్టుపరిశ్రమ శాఖా, జిల్లా ఉద్యాన వన శాఖ, అదనపు అటవీ శాఖ, జిల్లా గ్రామీణ నీటి యాజమాన్యసంస్థ , జిల్లా పంచాయతీ, ఐ.సి.డి.ఎస్, గృహనిర్మాణ సంస్థ, వైద్య ఆరోగ్య శాఖలు వారీగా సమీక్షలు నిర్వహించారు. వైద్య ఆరోగ్య శాఖకు సంబందించిన సమీక్షలో ఆరోగ్యశ్రీ అమలుపై జడ్పిటిసి సభ్యులు ఎస్.నాగేశ్వర రావు, టి. సీతారామ్ వివరణ కోరగా సంబంధిత జిజిహెచ్ సూపరింటెంట్ వివరించారు. సమావేశానికి జడ్పీటీసీ సభ్యులు, వివిధ శాఖల జిల్లా అధికారులు వారి ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## నారాయణరావు మాష్టారు, స్నేహితుల ఉదారత

**-వాసుదేవ బ్రహ్మోత్సవాలకు రూ.50వేలు అందజేత**

**మందస, ఫిబ్రవరి 21(వార్త):** శ్రీవాసుదేవ పెరుమాళుని బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. దాతలు సహకరిస్తున్నారు. దీనిలో భాగంగా ఉద్యోగ విరమణ చేసిన ప్రధానోపాధ్యాయుడు వాయలపల్లి నారాయణరావుమాష్టారు తన ఉదారతను చాటుకున్నారు. నారాయణరావు, బంధువులు, స్నేహితులు కలిసి బ్రహ్మోత్సవాలకు రూ.50వేలను అందజేశారు. భక్తులకు తదియారాధన నిమిత్తం ఈ విరాళాన్ని అందజేస్తున్నట్టు నారాయణరావు ఆయన సతీమణి రమాదేవి దంపతులు చెప్పారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు గోపినంబాళ్ల దాసుకూర్మాచార్యులు, శ్రీవాసుదేవసేవాసమితి ప్రతినిధులు జామి ప్రసాదరావు, జల్లు కాళీచరణ్ ఉన్నారు. నారాయణరావు కుటుంబానికి, వారి పరివారానికి వాసుదేవుని ఆశీస్సులు వారు అందజేశారు.

## టీడీపీ నాయకుల పరామర్శ



**వంగర, ఫిబ్రవరి 21(వార్త):** అరసాడ గ్రామానికి చెందిన ఉప్పు పారమ్మ (65) ఈనెల 19న గుండెపోటుతో మృతి చెందడంతో ఆమె కుమారులు ఉప్పు గంగులు, ఉప్పుగున్నయ్యను టిడిపి సీనియర్ నాయకులు లచ్చుభుక్త కృష్ణమూర్తి, విజయనగరం జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యులు మజ్జి గణపతి శుక్రవారం పరామర్శించారు. సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో పేడాడ అప్పన్న పాల్గొన్నారు.

# మా డిమాండ్లు నెరవేర్చండి

**-ఎమ్మెల్యేకు మున్సిపల్ కార్మికుల వినతి**





**పలాస, ఫిబ్రవరి 21(వార్త):** పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషకి మున్సిపల్ శానిటేషన్ కార్మికులు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం శుక్రవారం అందజేశారు. గత కొన్ని సంవత్సరాలనుండి మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారం కావడం లేదని, దీనివల్ల మున్సిపల్ పరిధిలో పనిచేయడం కూడా కష్టం అవుతున్నదని కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే జోక్యం చేసుకొని సమస్యలు పరిష్కారం చేయాలని విజ్ఞప్తి చేశారు.

పలు డిమాండ్స్ :-

1) చనిపోయిన వారి స్థానంలో వారి కుటుంబ సభ్యులకు ఉపాది కల్పించాలని,

2) పని ముట్లు ఇవ్వాలి. పాడైనా తోపుడు బండ్లు రిపేరు చెయ్యాలని,

3) మున్సిపాలిటీలో తగిన శానిటేషన్ వర్కర్స్ ను భర్తీ చేయాలని,

4) పెండింగ్ లో ఉన్న పి యఫ్ డబ్బులు కార్మికుల ఖాతాలలో జమ చేయాలని,

5) ఆప్ కాస్ రద్దు నేపథ్యంలో కార్మికులు అందరిని పర్మినెంట్ చేయాలని,

6) పని కాంట్రాక్టుకు ఇవ్వాలనే ఆలోచన విరమించాలని,

7) గత సమ్మె కాలంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని

8) ఇచ్చిన జి ఓ ప్రకారం పండగ బోనస్ వెయ్యి రూపాయలు చెల్లించాలని

9)కార్మికులు చనిపోయిన సందర్భంలో దహనసంస్కారం ఖర్చులు ఇప్పించాలని

10)సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి.

దీనిపై సుప్రీం కోర్టు తీర్పు అమలు చేయాలని సిఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్ గణపతి, యూనియన్ ప్రతినిధులు సి హెచ్ మురగన్, కె వెంకటి, బి కుర్మారావులు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో యం రవి, తిరుపతి, బాలక్రిష్ణ,రమేష్, రాము, తదితరులు పాల్గొన్నారు.

## రఘువర్మకు మద్దతు తెలపండి



**వంగర, ఫిబ్రవరి 21(వార్త):** ఏపీటీఎఫ్ అభ్యర్థి పాకలపాటి రఘువర్మకు మద్దతు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని సింహాచలం, విజయనగరం జిల్లా అధ్యక్షుడు గట్టి పాపారావు కోరారు... శుక్రవారం వంగర మండలంలో వివేక్ మాస్టర్ మైండ్స్ పాఠశాల తో పాటు పలు పాఠశాలలో ఉపాధ్యాయులను కలిసి రఘువర్మకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఉపాద్యాయులు సమస్యలు పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు. బసవరాజు సత్యన్నారాయణ 'తారక్ తదితరులు పాల్గొన్నారు.

# కాశీబుగ్గ పాత బస్టాండ్‌లో చిరు వ్యాపారస్తులకు స్థలం





**పలాస, ఫిబ్రవరి 21(వార్త):** పలాస కాశీబుగ్గ పురపాలక సంఘంలో రోజువారి పారిశుధ్య పనులు పరిశీలనలో భాగంగా కాశీబుగ్గ 18వ వార్డు గాయత్రి నగర్ లో రోడ్డు స్వీపింగ్ ప్రక్రియను పలాస కమిషనర్ నడిపేన రామారావు పరిశీలించారు. శుక్రవారం పలాస 24వ వార్డు పురుషోత్తపురంలో గార్బేజ్ ను దగ్గర ఉండి పరిశుభ్రం చేయించారు. పలాస 30వ వార్డు ఉదయపురం గాయత్రీ మాత టెంపుల్ ప్రాంతంలో రోడ్ల పరిస్థితిని పరిశీలించి అక్కడ గల స్పీడ్ బ్రేకర్లు వలన కలుగుతున్న ఇబ్బందులను గమనించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. పలాస 28వ వార్డు గోడగల వీధిలో శానిటేషన్ పరిస్థితిని పరిశీలన చేసి, సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు. పలాస 30 వ వార్డు ఉదయపురం మంచినీటి భావి వద్ద సమీక్షించి తక్షణం క్లోరినేషన్ చేయవలసిందిగా సిబ్బందిని ఆదేశించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, పలాస కాంపౌండ్ వాల్ కి ఆనుకొని ఉన్న అనధికార ఆక్రమణలను గుర్తించారు. కాశిబుగ్గ బస్టాండ్ లో రోజువారి వీధి వ్యాపారస్తులు , వారు వ్యాపారం చేసుకునేందుకు వీలుగా మరియు ప్రజల రాకపోకలకు అంతరాయం కలుగుతుందని తెలిపారు. ఇందుకుగాను వ్యాపారస్తులు గుర్తించిన స్థలాలపై దుకాణాలు ఏర్పాటు చేయాలని చెప్పారు.

## రైల్వే అండర్ పాసేజి పునరుద్ధరణ పనులు

**ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 21(వార్త):**స్థానిక ఎం.తోటూరు రైల్వే అండర్ పాసేజి( కొండ నీరు సయ్యద్ ఖాన్ చెరువు కు పారే తూము) పునరుద్ధరణ పనులు చేపట్టారు.గత రెండు రోజులు గా తోటూరు యువత శ్రమదానం చేస్తున్నారు. విషయం తెలుసుకున్న రైల్వే సిబ్బంది పునరుద్ధరణ పనులు లో భాగస్వామ్యం అయి పనులు చేపట్టారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## నేడు మందసలో మాజీ మంత్రి సీదిరి జన్మదిన వేడుకలు



**మందస, ఫిబ్రవరి 21(వార్త):** మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్టు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దల్లి జానకి రెడ్డి చెప్పారు. బర్తడే వేడుకలను మందస పట్టణంలోని బస్టాండ్ లో నిర్వహిస్తున్నామని, ఉదయం 9 గంటలకు కేక్ కటింగ్, పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. మండల వైఎస్సార్ పార్టీ పెద్దలు, ఎంపీటీసీలు, సర్పంచులు, కార్యకర్తలు హాజరు కావాలని, కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.




## అరకభద్రలో సంకల్పం

**ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 21(వార్త):** మండలం అరకభద్ర గ్రామంలో రూరల్ పోలీసులు ఆధ్వర్యంలో సంకల్పం కార్యక్రమం నిర్వహించారు. కాశిబుగ్గ డి ఎస్ పి వి వి అప్పారావు మాదక ద్రవ్యాలు పట్ల జరిగే అనర్థాలు గురుంచి వివరించారు. సైబర్ నేరాలు గురుంచి ఆహాగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సి ఐ ఎం చిన్నం నాయుడు, ఎస్ ఐ శ్రీనివాస్ రావు లు పాల్గొన్నారు.

## ముమ్మరంగా వాహన తనిఖీలు



**కొత్తూరు, ఫిబ్రవరి 21 (వార్త):** మండల కేంద్రంలో అంబేద్కర్ నాలుగు రోడ్ల జంక్షన్ లో సి. ఐ చింతాడ ప్రసాద్ ఆధ్వర్యంలో ముమ్మరంగా వాహన తనిఖీలు జరిగాయి. వాహన తనిఖీల్లో ప్రధానంగా వాహనాలకు, వాహన చోదకులకు తప్పనిసరిగా ఉండాల్సిన పత్రాలపై ఆయన ప్రత్యేక నిఘా పెట్టారు. ఎటువంటి పత్రాలు లేకుండా వాహనాలు నడిపే వారిపై ఆయన అపరాధ రుసుములు వేశారు. అలాగే వాహనాలపై ఏమైనా పెనాల్టీ బకాయిలు ఉన్నట్లు గుర్తిస్తే వెంటనే వారిని పెనాల్టీలు చెల్లించాలని ఆదేశించారు. హెల్మెట్ ధారణ, ట్రిపుల్ రైడింగ్, మైనర్లు వాహనాలు నడపడం, అనుమానిత వాహనాలను తనిఖీలు చేపట్టారు. నిషేదిత వస్తువులు అక్రమంగా తరలించినట్లయితే కఠిన చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా సీఐ చింతాడ ప్రసాద్ హెచ్చరికలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ చింతాడ ప్రసాద్ వెంట మిగతా పోలీసు సిబ్బంది ఉన్నారు.

## ఫారం పాండ్స్ పూర్తిస్థాయిలో నిర్మించండి



**ఎచ్చెర్ల, ఫిబ్రవరి 21(వార్త):** ఫారం పాండ్స్ పనులు పూర్తిస్థాయిలో చేయాలని, అలా కాకుండా సగం పనులు చేసి వదిలేస్తే అవి నిరుపయోగంగా మారుతాయి అని జిల్లా నీటి యాజమాన్యం సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ బి సుధాకర రావు అన్నారు. శుక్రవారం చిలకపాలెం పంచాయతిలో ఫారం పాండ్స్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫారం పాండ్స్ అవుట్ లెట్ మరియు ఇన్ లెట్ ధర్మంతో పాటు రాతి యాప్రాన్ పనులను కూడా చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు అనంతరం సిసి రహదారి పనులను పరిశీలించారు ఈ కార్యక్రమంలో ఏపీఓ శోబాదేవి, ఈసీ నారాయణమ్మ, బి యఫ్ టి గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు.

## డిమాండ్ల సాధనకు బ్యాంకు ఉద్యోగుల ధర్నా




**శ్రీకాకుళం, ఫిబ్రవరి 21(వార్త):** యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ ఆధ్వర్యంలో దాదాపు పది లక్షల ప్రభుత్వ రంగ బ్యాంకు ఉద్యోగులు, అధికారులు మార్చి నెల 24, 25 తేదీల్లో సమ్మెకు వెళ్లడం జరుగుతుంది. అందులో భాగంగా ఈరోజు యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంకు యూనియన్స్ శ్రీకాకుళం కన్వీనర్ కామ్రేడ్ కే సిహెచ్ వెంకటరమణ ఆధ్వర్యంలో శ్రీకాకుళం స్టేట్ బ్యాంకు ప్రధాన శాఖ జిటి రోడ్లో ధర్నా చేయడం జరిగినది.

కామ్రేడ్ వెంకటరమణ మాట్లాడుతూ ఈ సమ్మె యొక్క ముఖ్య ఉద్దేశం మరియు ప్రధానమైన డిమాండ్లను తెలియజేశారు. ప్రభుత్వ రంగ బ్యాంకులను పరిరక్షించాలని మరియు బలోపేతం చేయాలని. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఉద్యోగులు మరియు అధికారులు తగిన సంఖ్యలో నియమించాలని తెలియజేశారు. అదేవిధంగా బ్యాంకుల్లో పని ఒత్తిడి విపరీతంగా ఉన్నందువల్ల మరియు డిజిటలైజేషన్ బ్యాంకుల్లో అందుబాటులో ఉన్నందువల్ల వారానికి ఐదు రోజులు పని దినం ఇవ్వాలని ప్రధాన డిమాండ్ గా కోరుచున్నాము అని తెలియజేశారు. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఖాతాదారుల ముఖ్యమైన సమాచారం మరియు ముఖ్యమైన ఫైల్లు మరియు నగదు తో కూడిన వ్యవహారం ఉన్నందున అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలు నియమించకూడదని వారి స్థానంలో పెర్మనెంట్ ఉద్యోగ నియమకాలు జరపాలని ప్రధాన డిమాండ్ అని తెలియజేశారు. ఇటీవల కాలంలో బ్యాంకు ఉద్యోగులపైన మరియు అధికారులపైన విపరీతమైన దాడులు జరుగుతున్న నేపథ్యంలో దీనిపైన ప్రభుత్వం తగిన చర్యలు తీసుకొని ఉద్యోగులకు తగు భద్రత బ్యాంకుల్లో కల్పించాలని కోరుతున్నామని తెలియజేశారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు గ్రాడ్యూటీ 25 లక్షలకు పెంచడం జరిగిందని దానికి అనుగుణంగా ప్రభుత్వ రంగ బ్యాంకు ఉద్యోగులకు కూడా 25 లక్షలు గ్రాడ్యుటి వర్తింపజేయాలని ప్రధాని డిమాండ్ అని తెలియజేశారు. ప్రభుత్వం ఇటీవల కొన్ని కార్మిక చట్టాలను సవరించి వాటిని ప్రభుత్వ రంగ బ్యాంకులకు రుద్దడానికి ప్రయత్నిస్తుందని వీటిని తిప్పి కొడుతూ ట్రేడ్ యూనియన్ని కాపాడడం, ఖాతాదారులు సొమ్ముకు భద్రత కల్పించడం మా ప్రధాన డిమాండ్ అని తెలియజేశారు. అదేవిధంగా ఇటీవల 12వ వేతన సవరణ లో భాగంగా కొన్ని మిగిలి ఉన్న డిమాండ్లను తక్షణమే నెరవేర్చాలని తెలియజేశారు.


ఈ ధర్నా కార్యక్రమంలో ఎస్బిఐ ఆఫీసర్స్ అసోసియేషన్ రీజనల్ సెక్రెటరీ కామ్రేడ్ కృష్ణ కిషోర్, లోకల్ సెక్రటరి నాయుడు, %ూ×దీూజ% కిషోర్, మండ శ్రీనివాస రావు, %ూ×దీజూూ% శ్రావణి, %ాదీ×% ఉద్యోగులు మరియు అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కె.నారాయణలో వినూత్న ప్రదర్శన





**మందస, ఫిబ్రవరి 21(వార్త):** మాతృభాష తెలుగుపై మమకారం అందరికీ ఉంటుంది. పాశ్చాత్య భాషల మోజులో పడి, కొందరు తెలుగు భాషను మరచిపోతున్న తరుణంలో తెలుగుభాషను కాపాడడానికి మాతృభాష ప్రియులు ఎంతో కృషి చేస్తున్నారు. మాతృభాషా దినోత్సవం సందర్భంగా మందస మండలంలోని కుంటికోట గ్రామంలో గల కె.నారాయణ స్కూల్లో విద్యార్థులు వినూత్న ప్రదర్శన కావించారు. కరస్పాండెంట్ గుంట రోహిణీశంకర్, డైరక్టర్లు గుంట బుద్ధసూర్య, అరవింద్ నారాయణన్ ఆధ్వర్యంలో తెలుగులహరి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రముఖులు హాజరైన ఈ కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన తెలుగు.. లహరి.. ఫెబ్ 21.. ఆకృతులు ఎంతగానో ఆకట్టుకున్నాయి. విభిన్నంగా విద్యార్థులు ఎంతో చక్కగా తెలుగు నుడికారాన్ని చాటి చెప్పే విధంగా కూర్చొని చూపరులను ఆకర్షించారు.



## క్షయను నివారించాలి

**వంగర, ఫిబ్రవరి 21(వార్త):** క్షయవాది నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని వంగర జడ్పిటిసి ప్రతినిధి కరణం సుదర్శన్ రావు పిలుపునిచ్చారు.

జాతీయ క్షయ నివారణ 100 రోజుల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం శ్రీహరిపురం ఆర్ఆర్ కాలనీ, శ్రీహరిపురం, నీలయ్య వలస గ్రామాల్లో ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఆరోగ్య సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు. "క్షయను నిర్మూలిద్దాం-ఆరోగ్య సమాజాన్ని నిర్మిద్దాం" అనే పలు నినాదాలతో ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు క్షయ వ్యాధి చాప కింద నీరులా వ్యాప్తిస్తోందని ,దగ్గు, ఆయాసం, కెల్ల, కపము వంటి పలు లక్షణాలు ఉన్నవారు ఆరోగ్య పరీక్షలు చేసుకొని క్షయ రహిత సమాజం నిర్మించడానికి ప్రతి ఒక్కరు ముందుకు రావాలని సుదర్శన్ రావు పిలుపునిచ్చారు. డాక్టర్. కలమటి .ఈశ్వరరావు మాట్లాడుతూ జాతీయ క్షయ నివారణ కార్యక్రమంలో భాగంగా వాహనం తో వైద్య సిబ్బంది అరసాడ క్లస్టర్ లో గ్రామాలకు వచ్చి వైద్య పరీక్షలు చేసి ఈ పరీక్షల్లో క్షయ నిర్ధారణ గల రోగులకు రిఫరల్ రాజాం, విజయనగరం ఆసుపత్రులకు పంపించడం జరుగుతుందని వివరించారు.

ఈ కార్యక్రమంలో టీ.బి సూపర్వైజర్ పి. వేణుగోపాల్, సి.హెచ్.ఓ .ఎస్.యామినీ, ఏఎన్ ఎం. సరస్వతి, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## గురుకులంలో ఫేర్‌వెల్ డే వేడుకలు

**వంగర, ఫిబ్రవరి 21(వార్త):** మడువలస డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రెసిడెన్షియల్ గురుకుల కళాశాలలో శుక్రవారం ఘనంగా ఫేర్‌వెల్ డే వేడుకలను నిర్వహించారు. కాలేజీ ప్రిన్సిపాల్ పద్మజ ఆధ్వర్యంలో జరిగింది. ఇందులో విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను అలరించాయి. ఈ కార్యక్రమంలో కాలేజీ యాజమాన్యం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# జగన్ దృష్టికి పవర్‌ప్లాంట్ సమస్య

**ఆమదాలవలస, ఫిబ్రవరి 21(వార్త):** సరుబుజ్జిలి, బూర్జ మండలాలకు ఆనుకొని వెన్నెలవలస వద్ద 3000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం గల థర్మల్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేయనున్నట్లు స్థానిక ఎమ్మెల్యే కూన రవికుమార్, ప్రకటించడంతో పాటు ప్రభుత్వం కూడా ఆదిశగా అడుగులు వేయడం తెలిసిన విషయమే.

ఈ నేపథ్యంలో థర్మల్ పవర్ ప్లాంట్ ఏర్పాటుతో ఈ ప్రాంతం ప్రజలు నష్ట పోతారని, స్థానిక వైసిపి నాయకులు, వ్యతిరేకిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రజా సంఘాలతో కలిసి పవర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామన్న గ్రామాల పరిధిలో ప్రజలతో మమేకమై ప్రజలకు హాని కలిగించే పరిశ్రమను అడ్డుకుంటామని ప్రకటించారు. దివంగత పాలవలస రాజశేఖర్ కుటుంబాన్ని పరామర్శించేందుకు జగన్మోహన్ రెడ్డి గురువారం పాలకొండ వచ్చిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ హెలిపాడ్ వద్ద జగన్మోహన్ రెడ్డిని కలిసి పవర్ ప్లాంట్ నిర్మాణం జరిగితే జరిగే నష్టాలపై వినతి పత్రాన్ని సమర్పించారు.

పార్టీ తరపున ప్రజలకు అండగా నిలబడేందుకు తమ వంతు సహకారం అందించాలని పోరాట కమిటీ సభ్యులతో కలిసి వినతి పత్రం అందజేశారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించినట్లు సమన్వయకర్త రవికుమార్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు.



# ఘనంగా కొత్తూరు కళాశాల స్వర్ణోత్సవం



**కొత్తూరు, ఫిబ్రవరి 21 (వార్త):** మండలంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల నేటికి 50 ఏళ్ళు పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం నాడు కళాశాలలో స్వర్ణోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ బండారు రవికుమార్ మాట్లాడుతూ నేను 2002 లో డిగ్రీ చదివే రోజుల్లో జిల్లా కలెక్టరు నిర్వహించిన వైద్య శిబిరంలో సేవలందించేందుకు తన మిత్రుడు తో ఇక్కడికి వచ్చానని , నాటి నుండి మనసులో ఇక్కడ కచ్చితంగా పని చేయాలని ఆనాడే నిశ్చయించుకున్ననీ, అనంతరం జూనియర్ లెక్చరర్ గా 2012 సెప్టెంబర్ 12 న ఇదే కళాశాలకు ఫిజిక్స్ లెక్చరర్ గా జాయిన్ అయి , కొన్నేళ్లు సరుబుజ్జిలిలో విధులు నిర్వహించి, మళ్లీ కొత్తూరుకు ప్రిన్సిపల్ గా రావడం నాకు ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రధమ ప్రిన్సిపల్ గోపాల్ దాస్ నాయుడు మాట్లాడుతూ 1972 నుండి కొత్తూరు జూనియర్ కళాశాల కోసం ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ రెండేళ్లు తిరిగితే 1974 లో కళాశాల మంజూరు చేశారని, నాటినుండి నేటి వరకు జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి లలో కొత్తూరు జూనియర్ కళాశాల ప్రథమ స్థానంలో నిలిచి ఉత్తీర్ణతలో ముందు వరుసలో నాటి నుండి నేటి వరకు నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఈవో తిరుమల చైతన్య మాట్లాడుతూ దేశ విదేశాల్లో ఇక్కడ చదువును అభ్యసించిన పూర్వ విద్యార్థులు అన్ని రంగాల్లో సత్తా చాటుతున్నారని, ఇప్పుడు విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు రాబోయే రోజుల్లో ఉన్నత స్థానానికి చేరుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి పూర్వ అధ్యాపకులు, వివిధ రాష్ట్రాల్లో స్థిరపడిన, స్థానిక పూర్వ విద్యార్థులు, పెద్ద ఎత్తున ఈ స్వర్ణోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఎర్రముక్కాం బీచ్ బాగుంది!



**సోంపేట, ఫిబ్రవరి 21(వార్త):** ఎర్రముక్కాం సముద్రతీరంలో ఉన్న రాళ్లు సహజ సిద్ధంగా ఏర్పడిన ఇసుక తిన్నెలు చూసేందుకు చాలా బాగున్నాయని , అందాలను జిల్లా టూరిజం శాఖ అధికారి నారాయణరావు, అన్నారు. శుక్రవారం స్థానిక మత్స్యకారులు తో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిఎఫ్ఓ, శ్రీనివాసరావు, ఉప్పలాం సచివాలయం ఫీల్డ్ అసిస్టెంట్ కుమార స్వామి, ఎకువూరు , ఎర్రముక్కాం గ్రామాలకు చెందిన మత్స్యకారులు పాల్గొన్నారు . ఈ సందర్భంగా డిటిఓ మాట్లాడుతూ జిల్లాలో తాను ఇప్పటిదాకా 75 ప్రాంతాలు పరిశీలించానని అయితే ఎర్రముక్కాం సముద్ర తీరంలో 500 మీటర్ల పొడవున రాళ్లు ఉండడం మరెక్కడ చూడలేదని పర్యాటక అభివృద్ధికి ఈ ప్రాంతం అనుకూలంగా ఉందని, ఇక్కడ అందాలను సెల్ ఫోన్ లో బంధించి ఉన్నతాధికారులకు చూపిస్తానని అన్నారు. .ఇదే గ్రామానికి చెందిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి , సోంపేట మాజీ జెడ్పీటీసీ సభ్యులు జిల్లా కలెక్టర్ ,టూరిజం శాఖ అధికారులకు ఇచ్చిన వినతులు మేరకు పరిశీలనకు వచ్చినట్లు తీరప్రాంత మత్స్యకార ఐక్యవేదిక ప్రతినిధులు వాసుపల్లి ,కృష్ణారావు , మాగుపల్లి పాపారావు, బడె సూర్య నారాయణ ,బడె జానకిరావు లు తెలిపారు.

## మహిళా కళాశాలలో..
## అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 21(వార్త):** ప్రభుత్వ మహిళా కళాశాల (స్వయం ప్రతిపత్తి) శ్రీకాకుళం నందు 21-2- 2025వ తేదీన తెలుగు విభాగం వారు "అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ" కార్యక్రమాన్ని నిర్వహించారు . ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. సూర్య చంద్ర రావు గారుఅధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ- ప్రతి ఒక్కరూ తమ మాతృభాషను తప్పనిసరిగా పరిరక్షించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీ బడాన శ్యామల రావు తెలుగు అధ్యాపకులు (ప్రభుత్వ మోడల్ కళాశాల లావేరు మండలం) విచ్చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ -ప్రపంచంలోని చిన్న పెద్ద భాషలన్నిటిని రక్షించుకోవాలని భాషా సంస్కృతిని వైవిధ్యాన్ని కాపాడుకోవాలని దాని ద్వారానే మన జీవ వైవిధ్యాన్ని కాపాడుకోగలమని అన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ పి. శంకరనారాయణ గారు, అకడమిక్ కోఆర్డినేటర్ సిహెచ్ .కృష్ణారావు గారు, ఐక్యూఏసి కోఆర్డినేటర్ ఎస్. పద్మావతి గారు ,కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ శ్రీమతి టి, ఆదిలక్ష్మి గారు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని తెలుగు శాఖాధిపతి డాక్టర్ కే. జ్యోతిలక్ష్మి, డాక్టర్ కే. గిరిజ,వి .భవాని మొదలైన వారు నిర్వహించారు .ఈ కార్యక్రమంలో కళాశాలలోని అధ్యాపకులు విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం





# కమనీయం..

* కనుల పండువగా స్వామివారి కల్యాణం * ఆధ్యాత్మికతతో మార్మోగిన మందస * జనసంద్రమైన మందస

# వాసుదేవుని కళ్యాణం

మందస, ఫిబ్రవరి 21(వార్త):
వాసుదేవుడు కల్యాణ వరుడయ్యాడు.. ఓ వైపు వేదపండితుల మంత్రోచ్ఛారణ... మరోవైపు మంగళవాయిద్యాలు... ఇంకోవైపు వేలాదిమంది భక్తుల శ్రీమన్నారాయణ మంత్ర జపం... ఆకాశమంత పందిరి... భూదేవంతా పెండ్లి పీట అన్నట్లు శ్రీవాసుదేవుని కల్యాణం జరిగింది. తిలకించడానికి రెండు నేత్రాలు చాలవన్నట్టుగానే దివిలోని శ్రీనివాసుని పరిణయం భువిలో జరుగుతోందా అనిపించేలా ఏర్పాట్లు చేసి, శ్రీవాసుదేవునికి శ్రీదేవి, భూదేవిలతో కల్యాణం జరిగింది. శ్రీవాసుదేవ పెరుమాళుని 16వ బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారు కల్యాణం కడు కమనీయంగా జరిగింది. భక్తుల గోవిందా... వాసుదేవా... శ్రీమన్నారాయణల నామస్మరణ మధ్య వాసుదేవుడు శ్రీదేవి, భూదేవిలను వివాహమాడారు. ఆగమ శాస్త్రరీతిలో స్వామి పరిణయాన్ని వేదపండితులు కల్యాణ మంత్రోచ్ఛారణ మధ్య జరిపించారు. స్వామి కల్యాణం తిలకించడానికి వివిధ ప్రాంతాలను భక్తులు భారీ ఎత్తున వచ్చారు. శ్రీత్రిదండి దేవనాథరామానుజ జీయర్ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకులు గోపినంబాళ్ల దాసుకూర్మాచార్యులు, వేదపండితులు, అర్చకులు వాసుదేవుని కల్యాణం వైభవంగా జరిపించారు. పూబంతులాట, పుష్పమాల నృత్యాలు, కట్నచదివింపులు సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఆండాళ్లగోష్టి, కంచిలి మండలం నుంచి కంచమ్మతల్లి కోలాటం మహిళలు స్వామి కల్యాణానికి కోలాటం నృత్యం చేశారు. భక్త జనసందోహం మధ్య స్వామివారి కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. జైశ్రీమన్నారాయణ మంత్రంతో మార్మోగిన మందస బ్రహ్మోత్సవాల్లో భాగంగా వేకువజాము నుంచే భక్తులు వాసుదేవుని వేలసంఖ్యలో దర్శించుకున్నారు. మహిళలు గరుడస్థంబం వద్ద పూజలు చేశారు. భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కావించారు. ఆలయం పరిసర ప్రాంతాలతో పాటు మందస పట్టణంలో కూడా శ్రీమన్నారాయణుడి నామస్మరణతో మార్మోగింది. యువకులు, మహిళలు స్వచ్ఛందంగా స్వామి సేవలో పాల్గొని, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా కృషి చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆధ్యాత్మిక వేత్తలు, రాజకీయనాయకులు తదితరులు పాల్గొన్నారు. మధ్యాహ్నం వేలాది మంది భక్తులను అన్నదానం కావించారు. సాయంత్రం పలాసకు చెందిన అన్నమయ్య హరి శరణాగతి కళహకారులతో జరిగిన అన్నమయ్య సంకీర్తనలు, రాజమండ్రికి చెందిన నృత్య కళాకారిణి హరిప్రియ కూచిపూడి నృత్య ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. రాత్రి గరుఢవాహన సేవలో కల్యాణ దంపతులైన శ్రీభూసమేత వాసుదేవుని మందస పురవీధుల్లో తిరువీధి మహోత్సవం కార్యక్రమాలు జరిగాయి.













## లోక కల్యాణమే వాసుదేవుని పరిణయం: త్రిదండి దేవనాథరామానుజ జీయర్ స్వామి

భగవంతుడైనా, మనుజుడైనా పరిపూర్ణత్వం లభించాలంటే పరిణయం అవసరమని శ్రీత్రిదండి దేవనాథరామానుజ జీయర్ స్వామి అన్నారు. భగవంతుని కల్యాణం లోకకల్యాణమన్నారు. భూదేవి, శ్రీదేవిలను శ్రీవారు పరిణయమాడిన అనంతరం భక్తులనుద్దేశించి స్వామి మాట్లాడుతూ మాట్లాడుతూ భగవంతునికి నిర్ణీత రూపం లేదని, వాక్కు, మనస్సునకు అందని అతీతుడని అభివర్ణించారు. మానవునికి పూర్ణత్వాన్ని కలిగించడానికి వివాహం అనే ప్రక్రియను భగవంతుడు కల్పించాడు అని అన్నారు. కులాలన్నీ చేసేది మాధవుని సేవేనని, కులాలంటే జీవన విధానమేనన్నారు. అన్నమయ్య కీర్తనల్లో కూడా రామానుజుని స్తుతి ఉందన్నారు. నారాయణ మంత్రమే లోకానికి రక్షని, సర్వలోకాలకు తేజస్సును అందించేవి సూర్యుడు, చంద్రుడు ఈ రెండింటికి ప్రతీకగా సూర్యప్రభ, చంద్రప్రభ అనే రథాలు ఉంటాయని తెలిపారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా భగవంతుడు వాటిపై ఊరేగుతారన్నారు. మానవ శరీరం ఒక రథం, ఇంద్రాయాలు, గుర్రాలు, ప్రయాణం చేసేవాడు జీవుడు, నడిపిచేవాడు, సర్వేశ్వరడంటూ తత్వాని బోధించారు. బ్రహ్మోత్సవం అనేది ఒక అందమైన ప్రక్రియగా అభివర్ణించారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546